క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టడంతో పాటు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చినట్లు డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను తెలిపారు. అందులో భాగంగా ప్లస్ టు జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు ప్రిన్సిపాల్స్‌గా , జిల్లా పరిషత్ పీజీటీలకు పూర్తిస్థాయి వేతన స్కేల్‌తో పదోన్నతులు కల్పిస్తామని తెలియచేసినట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి ఉపాధ్యాయులకు సంబంధించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలపై మంత్రి బొత్స సత్యనారాయణ సానుకూలంగా స్పందించడంపై శ్రీను కృతజ్ఞతలు తెలియచేశారు. కాగా మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంది వెంకట రమణ కూడా ఉన్నారు.

ఘనంగా జ్ఞాన సరస్వతి విగ్రహ ప్రతిష్ట



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఇందిరానగర్‌లోని శ్రీసత్య సాయిబాబా మందిర ప్రాంగణంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. విగ్రహ దాతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మాధవి దంపతులచే వేదపండితులు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ముందుగా అష్టోత్తర శతనామాలతో పాదుకా పూజ, శాంతి హోమం జరిగింది. విగ్రత దాతల చేతుల మీదగా జ్ఞాన సరస్వతి అమ్మవారిని ప్రతిష్టించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, గరికపాటి రామకృష్ణ తదితరులున్నారు.

సరస్వతీదేవిగా అమ్మవారు దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువుదీరిన అమ్మవార్లు జ్ఞానప్రదాయిని సరస్వతీదేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. సకల శాస్త్రాలకు, విద్యలకు అధిష్టానదేవత సరస్వతీ దేవి. ఆమెను పూజించడం ద్వారా సకల జ్ఞాన సంపన్నులుగా ఎదుగుతారని పండితులు చెబుతారు. అందులోనూ మూలానక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం. ఆ రోజున అమ్మవారిని పూజించడం ద్వారా ఆమె త్వరతగతిన ప్రసన్నరాలవుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ క్రమంలో శుక్రవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకొని సరస్వతీదేవి మాతను భక్తులు విశేషంగా అర్చించారు. తెల్లవారుజాము నుంచి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వన్‌టౌన్ కేటీరోడ్డులోని శ్రీనివాసమహల్ సెంటర్‌లో కొలువై ఉన్న గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పలు విశేష వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కార్యక్రమాలను పర్యవేక్షించారు. బ్రాహ్మణవీధిలోని చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను అలరించారు. ఉభయదాతలతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మి దేవాలయంలో అమ్మవారికి విద్యాలక్ష్మీగా అలంకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు పర్యవేక్షించారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని ఇతర అమ్మవార్లకు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి నాగరాజు పర్యవేక్షించారు. కొత్తపేట సైకం వారివీధిలో కొలువై ఉన్న దర్పేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న పార్వతీదేవి అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు, ములానక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రధాన అర్చకులు మురళీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ పద్మావతి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రముఖ ఆగమ పండితులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేశారు. కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో కొలువై ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవిగా అలంకరించారు. భజనమండలి ఆధ్వర్యంలో సంకీర్తనాగానం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.



సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న చదును మహాలక్ష్మమ్మ



సరస్వతీదేవిగా పద్మావతి అమ్మవారు



సరస్వతీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



సరస్వతీదేవిగా గంగానమ్మ అమ్మవారు



సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన శివకాళేశ్వరిదేవి



సరస్వతిదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



వైభవలక్ష్మీదేవిగా లలితాంబికా దేవి



భీమనవారి పేటలో సరస్వతి దేవిగా విజయదుర్గ అమ్మవారు



కరకట్ట వద్ద సరస్వతిదేవిగా దుర్గా దేవి

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేదారేశ్వరపేటలో కొలువుదీరిన శివకాళేశ్వరి దేవి శుక్రవారం అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలనక్షత్రంలో సరస్వతి దేవిగా భక్తులకు దర్శమిచ్చారు.

సరస్వతీదేవిగా మహాలక్ష్మి అమ్మవారు..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం నేపథ్యంలో అమ్మవారిని భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు. ఏలూరు జిల్లా జైల్ సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీఎస్ స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి విచ్చేయగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ కమిటీ జ్ఞాపికను అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు, పోతిన వెంకట ధర్మారావు, బంక హనుమంతరావు, బెవర సాయి సుధాకర్, పణుకు రమా, పిళ్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అర్చన అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. భవానీపురం కరకట్ట వద్ద భవానీ దేవస్థాన కమిటీ వారి ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు, పూజలు చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకులు దంటు భవానీశర్మ పూజలు నిర్వహించగా, అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని లలితాంబికా పీఠంలో అమ్మవారు వైభవలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పర్యవేక్షించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకోగా, సాయంత్రం పంచహారతుల సేవ జరిగింది. ఉత్సవాలను పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షించారు.



కుంకుమార్చనలో భారీగా పాల్గొన్న మహిళలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో వేం చేసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో సరస్వతి హోమం, చండీహోమాలు నిర్వహించారు. హోమంలో పట్నాన వెంకట నవీన్ సంతోష్‌కుమార్, విజయనిర్మల దంపతులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ జరిపించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వైభవంగా శత చండీ హోమం..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం ఆరో రోజు అత్యంత వైభవంగా కొనసాగుతోంది. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అమ్మవారిని చండీ హోమం ద్వారా ఆర్చిస్తూ అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి వారి దేవస్థానం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టిన రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకొని యాగమండపంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు వెయ్యి మంది మంది మహిళలతో మూడు బృందాలుగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూల మంత్ర సంపుటితో చండీ హోమం చేశారు. రుద్ర, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలు కొనసాగించారు. ఉదయం కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి, నారాయణరావులు తదితరులు పాల్గొన్నారు. 56 మంది చండీయాగంలో పాల్గొన్నారు. అలాగే ఆంజనేయస్వామి వారి దేవస్థానంలోనూ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



సరస్వతి హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

















కనులపండువగా మహోత్సవాలు

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కొండంతా కనులపండువగా మారింది. మూలా నక్షత్రం రోజైన శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖలకు చెందిన అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. అమ్మవారిని కనులారా దర్శించుకొని ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారి సన్నిధిలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. కళావేదికపై నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





దసరా ఉత్సవాల్లో క్యూలైన్లు పరిశీలన

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సామాన్య భక్తులు త్వరగా దర్శనం కల్పించేలా మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆయన కొండ కింది భాగం నుంచి క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తుల రద్దీని క్రమపద్ధతిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే భక్తుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అక్కడే ఉన్న అధికారులను సమాయత్తం చేశారు. మరుగుదొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాలు, రోడ్లు, క్యూలైన్‌లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నిరంతరం క్యూలైన్‌లో ఉన్న భక్తులకు తాగు నీరు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. విజయ దశమి వరకూ అధికారులందరూ వారికి కేటాయించి స్థలాల్లో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. నగరంలోని సీతమ్మ వారిపాధాలు, శనీశ్వర స్వామి ఆలయం, దుర్గా ఘాట్, పద్మావతి ఘాట్, భవానిపురం పున్నమి ఘాట్‌లను శుక్రవారం ఉదయం కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బంది తో కలిసి పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఘాట్లో పారిశుద్యాన్ని నిర్వహించేందుకు ఆదేశాలిచ్చారు. కృష్ణవేణిఘాట్‌లోని కన్వేయర్ బెల్ట్ ను పరిశీలించి కన్వేయర్ బెల్ట్ చుట్టూ బ్యారిగేట్లు ఏర్పాటు చేయాలనీ అధికారులను సూచించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ సిటీ ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



క్యూలైన్‌లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆరోగ్య పరిరక్షణకు జగనన్న సురక్ష

కలెక్టర్ రాజాబాబు

పెనమలూరు: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి కార్మికనగర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో పేదలు వైద్యానికి ఎంతో ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేవారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి పేదలు అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడకూడదని జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటికే 317 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి దాదాపు 1.70 లక్షల మందికి టోకెన్లు ఇచ్చి వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యం, శస్త్ర చికిత్సలకు రిఫరల్ ఆస్పత్రులకు పంపి వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. వైద్య సిబ్బందిని ఇంటింటికీ పంపి వారి ఆరోగ్య సమస్యలు గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. 7రకాల ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే పార్థసారథి పేదలకు మందులు పంపిణీ చేశారు. చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలించారు.

మనోహరం కూచిపూడి నృత్యం

విజయవాడ కల్చరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం డాక్టర్ వేదాంతం పార్థసారథి బృందం ప్రదర్శించిన నర్తశాల నృత్య రూపకం మనోహరంగా సాగింది. రచన దర్శకత్వం డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.